సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు ధర పలికాయి. మార్కెట్‌కు 114 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

చిచ్చు రాజేసిన పొత్తు!

పవన్ 'పొత్తు' ప్రకటనపై అసంతృప్తి జ్వాల

- జనసేనతో జత కడితే తిప్పలేనని 'తమ్ముళ్ల' ఆవేదన
- పవన్ లేకపోతే టీడీపీకి భవిష్యత్ లేదంటున్న జన సైనికులు
- ఏ స్థానంలో ఏ పార్టీ బరిలో ఉంటుందనే దానిపై ఇప్పటి నుంచే చర్చ
- ఇరకాటంలో ఎమ్మెల్యే టికెట్ రేసులోని టీడీపీ నేతలు

సాక్షి, పుట్టపర్తి

టీడీపీ, జనసేన 'పొత్తు'పొడుపు స్థానిక నేతలకు పెద్ద చిక్కుతెచ్చి పెట్టింది. స్కిల్ స్కాం కుంభకోణంలో అరెస్టయిన చంద్రబాబు రాజమండ్రి జైలులో ఉండగా.. పవన్ పొత్తులపై ప్రకటన చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. టీడీపీ పెద్దలు పొత్తు ప్రకటన చేస్తే బాగుంటుంది గానీ, ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా లేని పవన్ ప్రకటించడం ఏమిటో అర్థం కావడం లేదంటూ తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా జనసేన అధినేత కోసం నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణ జైలు వద్ద ఎదురు చూడటం వారిని మరింత కుంగ తీసింది. పైగా టీడీపీ పొత్తుతో జనసేన ఎన్నికల్లో పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించడం చూసి తమ భవిష్యత్ ఏమిటో అర్థం కాక అయోమయంలో పడిపోయారు. ఏళ్లుగా టీడీపీని నమ్ముకుని ఉన్నామని.. అయితే ఉన్నఫలంగా అధినేత జైలు పాలు కావడంతో నిన్న కాక మొన్న వచ్చిన పార్టీ నేతలే పొత్తులపై నిర్ణయాలు బహిర్గతం చేయడాన్ని తప్పు పడుతున్నారు. ఎవరితో ఎవరు కలవాలనే దానిపై ఇరు పార్టీల పెద్దలు కూర్చుని మాట్లాడి.. వెల్లడించి ఉంటే బాగుండేదని 'తమ్ముళ్ల' అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



చంద్రబాబును పక్కకు నెట్టేసి..

తమ పార్టీ అధినేత జైలులో ఉంటే.. జనసేనాని టీడీపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తామని ప్రకటించడంపై టీడీపీ నేతల్లో మరో సందేహం కూడా మొదలైంది. చంద్రబాబును బయటికి తెద్దామనే ఆలోచన లేకుండా.. ఎన్నికలు, పోటీలు, పొత్తుల గురించి పవన్ మాట్లాడటం సరికాదని టీడీపీ సీనియర్ నేతలు తప్పుపట్టారు. అంతేకాకుండా అరెస్టయిన చంద్రబాబును బయటికి తేవాలనే ఆలోచన పవన్‌కు లేదా అని మరికొందరు ప్రశ్నించారు. టీడీపీకి అండగా ఉంటామని పవన్ ప్రకటించడం ఏమిటి? పవన్ అండదండలు ఎవరికి కావాలి? పార్టీ గుర్తు కూడా లేని పవన్ టీడీపీకి అండగా నిలవడం ఏందని తీసిపారేస్తున్నారు.

ముదిరిన విభేదాలు..

టీడీపీ – జనసేన పొత్తు ప్రకటన తర్వాత నియోజకవర్గాల్లో ఇరు పార్టీల నాయకుల మధ్య విభేదాలు ముదిరాయి. ఎవరు పోటీ చేస్తారనే దానిపై ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. దీనికి తోడు ఎలా గెలుస్తారో చూద్దామంటూ ఒకరిపై మరొకరు విమర్శలకూ దిగుతున్నారు. కొన్ని చోట్ల టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ముఖ్య నేతలు ముందుకు రావడం లేదు. జనసేనను నమ్ముకుని బరిలో దిగడం ఏమిటనే ప్రశ్నలు నేతల్లో మొదలయ్యాయి. జనసేన నేతలు కూడా టీడీపీని నమ్ముకుని బరిలో దిగితే పరిస్థితి ఏమిటన్నదానిపై లెక్కలు వేసుకుంటున్నారు.

ఎన్నికల ప్రణాళికలో జనసైనికులు..

పవన్ కల్యాణ్ ప్రకటన తర్వాత జనసైనికులు ఎన్నికల ప్రణాళికల్లో మునిగిపోయారు. ఈసారి ధర్మవరం, పుట్టపర్తి, కదిరి స్థానాలను జనసేనకే కేటాయిస్తారన్న సమాచారం ఉందని చెబుతున్నారు. కొందరు జనసేన నాయకులైతే ఏకంగా ఏ నియోజకవర్గంలో నిల్చుంటే బాగుంటుందో లెక్కలు వేసుకుంటున్నారు. అయితే ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ రాలేదు. ఏ స్థానంలో ఎవరు పోటీ చేస్తారో తెలియదు... కానీ అప్పుడే జనసేన నేతలు ఏకంగా పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నేతలు అంటున్నారు.

ఒక్క సీటూ గెలవలేరు



టీడీపీ ఏ పార్టీతో జత కట్టినా వైఎస్సార్ సీపీకి ఎలాంటి నష్టమూ లేదు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతో పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారు. అందుకే జనమంతా మావైపే నిలిచారు. మా పొత్తు ప్రజలతోనే ఉంటుంది. ప్రజల అండదండలతోనే మరోసారి విజయదుందుభి మోగించడం ఖాయం. ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా 'సింహం సింగిల్ గానే వస్తుంది'.

– మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

కల్యాణోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి



శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించే శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవ సేవలో పాల్గొనాలనుకునే వారు పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21, 25, 26, 27, 28, 29వ తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్యాణోత్సవ సేవ టికెట్ రూ.4 వేలు కాగా, ఒక్కో టికెట్‌పై ఐదుగురికి ప్రవేశం ఉంటుందన్నారు. ఒక్కోరోజు కేవలం 5 టికెట్లు మాత్రమే జారీ చేస్తామని పేర్కొన్నారు.

రేపు డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 17న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఐదు, ఆరో సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జెక్టు ఫెయిలైన వారు ఇన్‌స్టంట్ పరీక్ష రాయవచ్చునని తెలిపారు. ఇది వరకు ఇచ్చిన పాత హాల్‌టికెట్‌తోనే పరీక్షకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో పేదల ఆరోగ్యానికి భరోసా



'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

సోమందేపల్లి: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా నిరుపేదల ఆరోగ్యానికి మరింత భరోసా దక్కుతుందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన సోమందేపల్లిలోని సాయినగర్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీపంలోని ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య సురక్ష సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... వైద్య సిబ్బంది ప్రతి గడపకూ వెళ్లి ఆయా ఇళ్లలోని వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల వివరాలు నమోదు చేయాలన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 8 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. సమాచార సేకరణ అనంతరం ప్రతి సచివాలయం పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి మందులు అందజేస్తారని, మెరుగైన వైద్య సేవలు అవసరం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' యాప్‌ను కుటుంబంలోని ఒకరి మొబైల్లో డౌన్లోడ్ చేయిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ నాగరాజు రావు, సర్పంచ్ గంగాదేవి, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

పోలీస్ పిల్లలకు ప్రతిభా పురస్కారాలు

- 45 మంది విద్యార్థులకు రూ.2.67 లక్షల ప్రోత్సాహ నగదు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారితో ఎస్పీ

పుట్టపర్తి అర్బన్: పోలీసు కుటుంబాల్లోని ప్రతిభ గల విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని, అందులో భాగంగానే ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. గత ఏడాది పది, ఇంటర్, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, పీజీల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన 45 మంది పోలీస్ పిల్లలను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పందన హాలులో ప్రతిభా పురస్కారాలు అందించి సన్మానించారు. ప్రోత్సాహకంగా పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.2,67,000 మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ... ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి గౌరవిస్తే వారు మరింత రాణిస్తారన్నారు. ముందు కూడా కష్టపడి చదివి లక్ష్యం చేరుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు తల్లిదండ్రులు నిరంతరం శ్రమించాలన్నారు. పిల్లలు సైతం తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పోలీసు కుటుంబాల్లో పిల్లలకు ఏ అవసరమున్నా తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐ టైటాస్, నారాయణ, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ కాపు నేస్తం' నగదు జమ

- నాల్గో విడతలో జిల్లాలోని 6,961 మందికి లబ్ధి



పుట్టపర్తి అర్బన్: కాపు, ఒంటరి, బలిజ, తెలగ ఉపకులాల్లో ఉన్న మహిళల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు వారికి ఆర్థిక స్వావలంబన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'వైఎస్సార్ కాపు నేస్తం'పథకం నాల్గో విడత నగదు శనివారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది. ఏడాదికి రూ.15 వేలు అందించే ఈ పథకం నిధులను తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. నాల్గో విడతలో జిల్లాలోని 6,961 మంది ఖాతాల్లో రూ.10.44 కోట్లు జమ కానున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. అందులో పుట్టపర్తి నియోజక వర్గంలోని 1,592 మందికి రూ.2.38 కోట్లు, ధర్మవరం నియోజకవర్గంలోని 1,169 మందికి రూ.1.75 కోట్లు, హిందూపురం నియోజకవర్గంలోని 727 మందికి రూ.1.09 కోట్లు, కదిరి నియోజకవర్గానికి చెందిన 1,559 మందికి రూ.2.33 కోట్లు, మడకశిర నియోజకవర్గంలోని 784 మందికి రూ.1.17 కోట్లు, పెనుకొండ నియోజకవర్గానికి చెందిన 923 మందికి రూ.1.38 కోట్లు, రాప్తాడు నియోజక వర్గానికి చెందిన 207 మందికి రూ.31.05 లక్షలు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



గుండె, ఊపిరితిత్తుల నియంత్రణ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైద్య సంస్థల్లో రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పనిచేస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు తెలిపారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లోని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్‌లో కార్డియాక్ సర్జరీ విభాగంలో రూ.1.4 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గుండె, ఊపిరితిత్తుల నియంత్రణకు వినియోగించే పరికరాన్ని శుక్రవారం ఆర్‌జె.రత్నాకర్‌రాజు ప్రారంభించారు. సత్యసాయి లక్ష్యాలకు అనుగుణంగా 22 సంవత్సరాలుగా నిరంతర వైద్యసేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు.

కదిరి విత్తుకు జాతీయ గుర్తింపు

- ఎన్‌జీ రంగా అగ్రివర్సిటీ పాలకమండలి సభ్యులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి



ఎన్‌జీ రంగా అగ్రివర్సిటీ పాలకమండలి సభ్యులకు కదిరి వంగడాల గురించి వివరిస్తున్న పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్

కదిరి: నూతన వేరుశనగ వంగడాలకు పేరుగాంచిన కదిరి పరిశోధనా కేంద్రం దేశానికే తలమానికంగా నిలిచిందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డా.ఎం. మల్లికార్జునరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు కదిరి పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి ఇక్కడి వేరుశనగ పరిశోధనలను పరిశీలించారు. కదిరి వేరుశనగ రకాలు దేశ వ్యాప్తంగా సాగులో ఉన్నాయని, అధిక దిగుబడులనిచ్చే వేరుశనగ రకం అనగానే కదిరి పేరు గుర్తుకొస్తుందన్నారు. ఇందుకు కారణమైన శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. అనంతరం 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పరిశోధనా స్థానం ప్రాంగణంలో పరిశోధనల కోసం సాగుచేసిన వివిధ రకాల వేరుశనగ రకాలను పరిశీలించారు. ఒక కొత్త రకం వేరుశనగ వంగడం కనుగొనేందుకు ఏడెనిమిదేళ్లు పడుతుందని ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్ వారికి వివరించారు. వేరుశనగ కోసం ప్రత్యేకంగా కనుగొన్న కొత్త రకం కలుపు మందులైన నానో యూరియా, నానో జింక్ సత్ఫలితాలిస్తున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

అన్ని విధాలా ప్రభుత్వ సహకారం..

కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం అభివృద్ధికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అగ్రి వర్సిటీ పాలక మండలి సభ్యులు తెలిపారు. సిబ్బంది కొరత అధిగమించడం, పరిశోధనల కోసం బడ్జెట్ పెంపు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. పరిశోధనా స్థానంలో ఎంతో విలువైన వేరుశనగ జన్యు సంపద అందుబాటులో ఉందని, దీన్ని భద్రపరిచేందుకు కోల్డ్ స్టోరేజ్ అవసరమని ఇక్కడి వ్యవసాయ శాస్త్రవేత్తలు కోరడంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. వీరి వెంట శాస్త్రవేత్తలు డా.ప్రసన్నరాజేష్, డా.వెంకటరమణ, డా.వేమన, డా.చెంద్రాయుడు ఉన్నారు.



దర్గా ఆవరణలో సేదదీరుతున్న భక్తులు

ఘనంగా షంషేర్ వేడుక



అశ్వంపై బీబీ జైనబ్బీ షంషేర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసులో భాగంగా శుక్రవారం అమ్మవారి షంషేర్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున అశ్వంపై షంషేర్‌ను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దర్గా ఆవరణలో నిర్వహించిన ఖవ్వాలి పోటీలు ఆకట్టుకున్నాయి.

పారామెడికల్ కోర్సులకు 19న కౌన్సెలింగ్

అనంతపురం క్రైం: వివిధ పారా మెడికల్ కోర్సుల శిక్షణకు ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కౌన్సెలింగ్ రోజున తమ ఒరిజినల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- డీఆర్‌ఓ కొండయ్య



గ్రీవెన్స్‌లో అర్జీ స్వీకరిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. అందులో భాగంగానే ప్రతి నెల మూడో శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక 'గ్రీవెన్స్' నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ శాఖల్లోని ఉద్యోగులు తమ వృత్తిలో వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు అందిస్తే పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అర్జీలు స్వీకరించారు.

కొన్ని వినతులు ఇలా..

- కలెక్టరేట్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న తనకు ఆరోగ్య సమస్యలున్నాయని, తన పరిస్థితిని అర్థం చేసుకుని అనంతపురం జిల్లాకు బదిలీ చేయాలని శ్రీనివాసులు కోరారు. అక్కడ మెరుగైన వైద్య చికిత్సలు తీసుకుంటానన్నారు.
- జిల్లా కేంద్రంలో పని చేసే అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ఏ మంజూరు చేయాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు లింగా రామమోహన్, పెద్దన్న, షబ్బీర్, శోభారాణి బాబన్న, శ్రీనివాసులు, శేఖర్ తదితరులు డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.
- పెనుకొండ అటవీశాఖలోని షీప్ ఫాంలో పని చేస్తున్న తనకు ఏడాది నుంచి జీతభత్యాలు, మెటీరియల్ పేమెంట్ మంజూరు కాలేదని అంజినప్ప తెలిపారు. వెంటనే ఇవ్వాలని డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.
- జిల్లాలోని కదిరి ఏరియా ఆస్పత్రి, నల్లమాడ సీహెచ్‌సీ, తనకల్లు సీహెచ్‌సీల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీతభత్యాల్లో 10 శాతం సీపీఎస్‌కు రికవరీ చేస్తున్నా, సదరు ఖాతాలో జమ కాలేదని స్టాఫ్‌నర్స్ హేమలత తదితరులు తెలిపారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సోమందేపల్లి: పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించాలని కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన సోమందేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా 'మట్టి వినాయకులనే పూజిద్దాం' అంటూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం వల్ల చెరువుల్లోని నీరు కలుషితం అవుతుందని, అలాగే పర్యావరణానికి నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కిశోర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రశాంతి నిలయం: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు డీఈఓ మీనాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న అన్ని డివిజన్ కేంద్రాల్లో పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో ఈ విద్యాసంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. జనరల్, బీసీ కేటగేరీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్‌తోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పరీక్ష రుసుము రసీదును ఈనెల 28తేదీలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్

కదిరి అర్బన్: ప్రధాన మంతి విశ్వకర్మ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పట్నం గ్రామ సచివాలయంలో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వడ్రంగులు, కుమ్మరులు, కంసాలులు, తాపీపని తదితర సాంప్రదాయ వృత్తులు చేసుకునే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత జిల్లా కో ఆర్డినేటర్ శివశంకర్‌రెడ్డి, కదిరి కౌన్సిలర్ వీరమారుతి, నాగప్పతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ల నియామకం

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాకు చెందిన జీను మహేష్‌బాబు, మారుతీ రెడ్డిలను జేసీఎస్ కోఆర్డినేటర్లుగా నియమించనట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఇక 'సింగిల్ స్పెషల్ డిగ్రీ'

- ఇప్పటి వరకూ డిగ్రీలో మూడు కామన్ సబ్జెక్టులు
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్టు కాంబినేషన్‌తో గ్రాడ్యుయేషన్
- 2023–24 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పరిపూర్ణంగా తీర్చిదిద్దేలా కోర్సు
- డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తుకు నోటిఫికేషన్ జారీ
- బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంలో నూతన సిలబస్‌కు రూపకల్పన



ఎస్కేయూ ముఖ ద్వారం

అనంతపురం: విద్యా ప్రమాణాల పెంపునకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)లో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక(కరికులమ్)ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ యూజీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండగా ఇకపై మేజర్ సబ్జెక్టు ఒక్కటే ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. 2023–24 విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ మొదటి సంవత్సరం 1, 2 సెమిస్టర్లలో ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గతంలో బీఎస్సీ ఎంపీసీలో మూడు సబ్జెక్టుల కాంబినేషన్ ఉండగా, వాటి స్థానంలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఏదో ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకుని డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చు. రెండో సెమిస్టర్‌లో దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులు బాటు కల్పించారు. తద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్యను పూర్తి చేసేలా సమూల మార్పులు చేశారు. ఇందుకు సంబంధించిన విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు నూతన సిలబస్‌కు రూపకల్పన చేశారు. డిగ్రీలో ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా ఈ విద్యాప్రణాళిక ఉండడం గమనార్హం. త్వరలో ఈ నూతన సిలబస్‌ను అకడమిక్ స్టాండింగ్ కౌన్సిల్‌లో పెట్టి ఆమోదింపజేయనున్నారు.

బీఎస్సీ, బీఏ, బీకామ్‌లో అమలు..

డిగ్రీలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఒక మైనర్ సబ్జెక్టు చదవాలనే నిబంధన పెట్టారు. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్, మార్కెటింగ్.. ఇలా ఇతర సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్‌లో (ఇంటర్మీడియట్ కోర్సుల ఆధారంగా) నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్ డిగ్రీలో అమలు చేయనున్నారు. డిగ్రీ విద్యలో ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం కానున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ఇప్పటికే తొలి దఫా అడ్మిషన్లు పూర్తయ్యాయి. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి అడ్మిషన్ కల్పించారు.

నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి..

ఇప్పటి వరకూ మూడో ఏడాది డిగ్రీ విద్య పూర్తయ్యేది. నూతన జాతీయ విద్యావిధానం-2020 అమలులో భాగంగా దేశంలో తొలిసారిగా విద్యా సంస్కరణలను ఏపీలోనే అమలు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని అందుబాటులోకి తీసుకువచ్చారు. యూజీసీ ఫ్రేమ్ వర్క్స్ ప్రకారం డిగ్రీని రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన వారు రీసెర్చ్ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీకి అర్హత సాధిస్తారు. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ ఆనర్స్ కోర్సుగా పరిగణిస్తారు. ఇది పూర్తి చేసిన వారు పీజీలో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఆనర్స్ కోర్సుల అమలుకు గత మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే అనుమతి మంజూరు చేస్తున్నారు.

సింగిల్ సబ్జెక్టుపై ప్రధాన దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచే సింగిల్ సబ్జెక్టు స్పెషల్ డిగ్రీ విధానం అమల్లోకి వచ్చింది. ఒక సబ్జెక్టుపై పూర్తి స్థాయి పట్టు సాధించడంతో పాటు, ఇతర సబ్జెక్టుల్లోనూ అవగాహన పెంపొందేలా నూతన విద్యా ప్రణాళికకు రూపకల్పన చేశారు. ఇప్పటికే నూతన విద్యా ప్రణాళికను ఉన్నత విద్యా మండలి పూర్తి చేసింది. ఈ అంశాలను బోర్డ్‌ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంలో ఆమోదించారు. త్వరలో అకడమిక్ స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత కొత్త సిలబస్ అమల్లోకి వస్తుంది. – ప్రొఫెసర్ కె.రాంగోపాల్, సీడీసీ డీన్, ఎస్కేయూ

పలువురు జడ్జీల బదిలీ

అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు జడ్జీలను బదిలీ చేశారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా కోర్టుకు సంబంధించి జి.శ్రీదేవి (అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి-7, ఫ్యామిలీ కోర్టు)ని కడప ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. గుత్తి సివిల్ జడ్జి టి.హరితను అనంతపురం ఫ్యామిలీ కోర్టు అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జిగా బదిలీ చేశారు. బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.సాదు బాబును అనంతపురం ఎస్సీ, ఎస్టీ కేసుల న్యాయస్థానం స్పెషల్ జడ్జిగా నియమించారు. అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.దీనబాబును కడప ఎస్సీ, ఎస్టీ కేసుల న్యాయస్థానం స్పెషల్ జడ్జిగా బదిలీ చేశారు. వీరు ఈ నెల 29లోపు బదిలీ అయిన స్థానాల్లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

- జీఆర్‌పీ ఎస్పీ కే.చౌడేశ్వరీ



మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరీ

గుంతకల్లు: జీఆర్‌పీ సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ దివస్ (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్పీ కే.చౌడేశ్వరీ తెలిపారు. శుక్రవారం స్థానిక జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్‌ను నిర్వహించారు. గుంతకల్లు రైల్వే జిల్లా (రైల్వే డివిజన్) వివిధ పోలీసుస్టేషన్లల్లో విధులు నిర్వర్తిస్తున్న దాదాపు 13 మంది అర్జీలను స్వయంగా ఎస్పీకి అందజేశారు. ప్రాధ్యనతా క్రమంగా అర్జీలను పరిష్కారిస్తానాని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ చౌడేశ్వరి మాట్లాడుతూ సమస్యలపై సిబ్బంది పదే పదే కార్యాలయం చుట్టు తిరగకుండా వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది వృత్తి, ఆరోగ్యపరమైన సమస్యల గురించి తనకు నిర్భయంగా తెలియజేయవచ్చన్నారు.

జ్వర పీడితులకు రక్త పరీక్షలు



జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట గ్రామంలో శుక్రవారం డాక్టర్ పుష్పలత, డీఎల్‌పీఓ శివకుమారి, ఎంపీడీఓ సౌజన్యకుమారి ఆధ్వర్యంలో జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. రెండు రోజుల క్రితం గవ్వల మధు అనే వ్యక్తి స్క్రబ్ టైఫస్‌తో మృతి చెందిన విషయం విధితమే. దీంతో వైద్య సిబ్బంది డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి జ్వరంతో బాధపడే వారు ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీశారు. 353 ఇళ్లను సర్వే చేసి 8 మంది జ్వర పీడితులను గుర్తించారు. వారికి రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న నీటిని పారవేసి డ్రైడేని పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకులపల్లిలో చింత చెట్టుపై నుంచి జారి పడి ఆంజనేయులు (51) మృతి చెందాడు. శుక్రవారం తన ఇంటి సమీపంలో ఉన్న చింత చెట్టుపై కోతులు ఉండడంతో వాటిని తరమడానికి ఆంజనేయులు చెట్టు పైకి ఎక్కాడు. అయితే అదుపుతప్పి జారి పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్రిడ్జీల నిర్మాణంలో అగ్రగామిగా భారత్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జెస్ ప్రెసిడెంట్ వినయ్‌గుప్తా

అనంతపురం: బ్రిడ్జి, టన్నెల్స్ నిర్మాణంలో మన దేశం అగ్రగామిగా ఉందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జి ఇంజినీర్స్ ప్రెసిడెంట్ వినయ గుప్తా అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'మోడర్న్ డే బ్రిడ్జెస్ అండ్ మెట్రో స్ట్రక్చర్స్' అనే అంశంపై శుక్రవారం ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఎంటెక్ (స్ట్రక్చర్స్, బ్రిడ్జి అండ్ టన్నెల్ ఇంజినీరింగ్) కోర్సును భారత రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ ఆర్థిక సాయంతో నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ కోర్సును నిర్వహిస్తున్న తొలి వర్సిటీగా జేఎన్‌టీయూకు గుర్తింపు దక్కిందన్నారు. బ్రిడ్జిలు, టన్నెల్ విభాగాల్లో మన దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందని, దీనికి అనుగుణంగా నిపుణులైన ఇంజినీర్లను తయారు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన మాట్లాడుతూ మన దేశం ప్రపంచంలోనే రెండో అతి పెద్ద రహదారులు కలిగిన దేశమని తెలిపారు. ఇటువంటి సదస్సులు అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఐఐబీఈ చైర్మెన్ ఆర్.కే. జైగోపాల్, సెక్రెటరీ అరవింద సలేచా, రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

పరిగి: మండలంలోని గొరవనహళ్లిలో వడ్డే అరుణ్ అలియాస్ ఆనంద్ (25) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నరేంద్ర వివరాల మేరకు... వడ్డే అరుణ్ హిందూపురంలో ఓ ఆయుర్వేద షాపులో పని చేస్తుండేవాడన్నారు. అరుణ్‌కు పెళ్లి అయినా కొన్ని రోజులుగా భార్య దూరంగా ఉందని చెప్పారు. తల్లి ఈశ్వరమ్మతో కలిసి ఉంటున్నాడన్నారు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడన్నారు. బంధువులు హిందూపురం ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడన్నారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పాముకాటుతో రైతు మృతి



రంగశామప్ప (ఫైల్)

రొళ్ల: పంటకు నీళ్లు కట్టే సమయంలో పాముకాటుకు గురై రంగశామప్ప (66) అనే రైతు మృతి చెందిన ఘటన హెచ్‌టీ హళ్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రొళ్ల మండలం హెచ్‌టీ హళ్లికి చెందిన రైతు రంగశామప్ప గురువారం సాయంత్రం తమ పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటకు నీళ్లు కట్టేందుకు వెళ్లారు. ఈ సమయంలో పాము కాటు వేసింది. రంగశామప్ప అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే కుటుంబ సభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం శిరా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాని వైద్యులు సూచించారు. అయితే చికిత్స పొందుతూ రంగశామప్ప మృతి చెందారు. మృతునికి భార్య సాకమ్మతో పాటు కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



అజిత్ (ఫైల్)

పావగడ: స్థానిక ఉర్దూ పాఠశాల ఆవరణలో అజిత్ (22) అనే ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... పట్టణంలోని ఉర్దూ పాఠశాల ఆవరణలో ఉన్న పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసే పనులు చేస్తున్నారు. తాలూకాలోని వైఎన్ హొసకోట మండలం గొడతిమ్మనహళ్లికి చెందిన ఓబులేసు కుమారుడు అజిత్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. పనిలో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కి తీగలను తొలగిస్తుండగా అజిత్ విద్యుదాఘాతానికి గురై చనిపోయారు. అంకిత్ అనే మరో విద్యుత్ కార్మికుడు కూడా కింద పడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యాయి. చికిత్స నిమిత్తం తుమకూరు ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ స్తంభంపై వారు పని చేస్తుండగా సమీపంలోని బీఎస్ఎల్ఎన్ కార్యాలయం వద్ద విద్యుత్ లేకపోవడంతో జనరేటర్ ఆన్ చేయడంతో స్తంభానికి విద్యుత్ సరఫరా అయి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో అజిత్ తల్లితండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుమూర్తి తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



డీఆర్‌ఓ కొండయ్యకు సమస్యలను వివరిస్తున్న ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

ప్రశాంతి నిలయం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి అధ్వర్యంలో ఆ సంఘం నాయకులు డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసిన ప్రతి పాఠశాలలో నైట్‌వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ భవనం నిర్మించాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఉద్యోగులకు 8 కిలోమీటర్ల రేడియస్ పరిధిలో 16 శాతం హెచ్‌ఆర్‌ఎను కేటాయించాలని విన్నవించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించాలని, తదితర సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ మండల నాయకులు సునీత, శంకర్, రాజగోపాల్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోండి

- ఎస్పీ మాధవరెడ్డి



డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ధర్మవరం రూరల్: వినాయక చవితి పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడారు. వినాయక చవితి పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ డీఎస్పీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు అనుమతి కోసం అర్జీలు ఇస్తే సిబ్బంది మండపం పెట్టుకోవడానికి అనువుగా ఉంటుందా? లేదా? పరిశీలించి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక పోలీసు అధికారులకు తెలియజేసి శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి అందరూ సహకరించాలన్నారు. నిమజ్జనం రోజున ప్రజలకు ఇబ్బందులు పెట్టే విధంగా ప్రవర్తించకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్లపై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ కమిషనర్ విధులకు ఆటంకం కల్గించినందుకు ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జి.రవి తన చాంబర్‌లో జగనన్న ఆరోగ్య సురక్షపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా వర్క్‌ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరెడ్డి కూడా కమిషనర్‌తో చర్చించేందుకు వెళ్లారు. అంతలోనే టీడీపీ మున్సిపల్ వైస్‌చైర్మన్లు అబ్దుల్ రహీమ్, సరస్వతితో పాటు కౌన్సిలర్లు మల్లికార్జున, రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి, షెక్షావలి కమిషనర్ చాంబర్ లోకి చొచ్చుకెళ్లారు. కమిషనర్ రవి సమీక్ష సమావేశాన్ని ముగించడంతో సిబ్బంది వెళ్లిపోగా వర్క్‌ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరెడ్డి మాత్రమే ఉన్నారు. కమిషనర్‌తో మాట్లాడుతుంటే ఇక్కడ నీకేం పనంటూ వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కమిషనర్‌తో కూడా కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవితో పాటు మిగతా వారు కూడా వాగ్వివాదానికి దిగారు. విధి నిర్వహణలో భాగంగానే తన చాంబర్‌కు వచ్చాడని కమిషనర్ చెబుతున్నా వారు వినలేదు. వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరెడ్డితో పాటు కౌన్సిలర్లకు కూడా కమిషనర్ సర్దిచెప్పి పంపించారు. టీడీపీ కౌన్సిలర్లు తరచూ తన విధులకు ఆటంకం కల్గిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ జి.రవి గురువారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు అబ్దుల్ రహీం, షేక్‌పర్వీన్, మల్లికార్జున, జింకా లక్ష్మీదేవి, షెక్షావలిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

మద్యానికి డబ్బివ్వలేదని యువకుడి ఆత్మహత్య

యల్లనూరు: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని రామాంజినేయులు (40) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన యల్లనూరు మండలం చిలమకూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాలమేరకు.. చిలమకూరుకు చెందిన రామాంజినేయులు, పెద్దక్క దంపతులు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. అయితే కొంతకాలంగా రామాంజినేయులు మద్యానికి బానిసై డబ్బులివ్వాలని భార్యను వేధించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కూడా మద్యానికి డబ్బులివ్వాలని పెద్దక్కను అడిగాడు. పూటగడటమే కష్టంగా ఉందని, ఇచ్చేదిలేదని భార్య తెగేసి చెప్పడంతో అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే లుంగీతో ఫ్యానుకు ఉరివేసుకొని రామాంజినేయులు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న ప్రైవేటు బస్సు



ప్రమాదానికి కారణమైన బస్సు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కారును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు... శుక్రవారం తెల్లవారు జామున బెంగళూరు వైపునకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కొడికొండ చెక్‌పోస్టలో వేగంగా వచ్చి ముందు వెళుతున్న కారును ఢీకొంది. గాయపడిన ముగ్గురిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించామన్నారు. స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు ఉన్నా బస్సు వేగంగా దూసుకొచ్చిందని గుర్తించామన్నారు. అయితే ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా - రైతు మృతి

పుట్లూరు: మండలంలోని రంగరాజుకుంటకు చెందిన పొన్నపాటి శివప్రసాద్‌రెడ్డి (32) అనే యువ రైతు శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు.. రంగరాజుకుంట గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, పుల్లమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా మూడో కుమారుడైన శివప్రసాద్‌రెడ్డి పొలంలో సేద్యం పనులు చేసి ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్నాడు. అయితే ఈ సమయంలో టైర్ పంక్చర్ కావడంతో ట్రాక్టర్ బోల్తా పడటంతో శివప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.